సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 7 । మార్చి । 2023



భారీ అగ్నిప్రమాదం

ఆటోనగర్ డి - బ్లాక్‌లో థర్మాకోల్ షీట్స్ తయారు చేసే పంచజన్య పాలీ ప్రొడక్ట్స్ కంపెనీలో అగ్నిప్రమాదం జరిగింది. 10లో



సిటీలో దాస్ కా ధమ్కీ

ఉగాది కానుకగా ఈ నెల 22న దాస్ కా ధమ్కీ చిత్రం విడుదల చేస్తున్నట్లు చిత్ర దర్శకుడు, నటుడు విశ్వక్ సేన్ తెలిపారు. 8లో



ప్రతిభకు 'వేదిక'

వేదిక పేరుతో నిర్వహిస్తున్న వైజాగ్ టాలెంట్ హంట్ కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా సాగింది. 8లో

పగలు సెగలు రాత్రి వణుకు

- కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతల మధ్య నాలుగు రెట్ల వ్యత్యాసం
- ఉమ్మడి విశాఖలో కనిష్టం 10 డిగ్రీలు
- గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నమోదు
- సీజన్ మార్పు వల్లే అంటున్న నిపుణులు

సాక్షి, విశాఖపట్నం : పగలు సెగలు.. రాత్రి వేళ వణుకు.. కొద్ది రోజుల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా వాసులకు ఇలాంటి అనుభూతే కలుగుతోంది. శీతాకాలం వెళ్లిపోయినా ఇప్పటికీ రాత్రి పూట చలి గజగజ లాడిస్తోంది. అంతేకాదు పగటి, రాత్రి ఉష్ణోగ్రతల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటోంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కనిష్ట (రాత్రి) ఉష్ణోగ్రతలకంటే గరిష్ట (పగటి) ఉష్ణోగ్రతలు దాదాపు నాలుగు రెట్ల అధికంగా ఉంటూ ప్రజానీకాన్ని ఒకింత ఆశ్చర్య చకితులను చేస్తోంది. కొద్ది రోజుల నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాలో పలుచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు 9–10 డిగ్రీలు నమోదవుతున్నాయి. అదే జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు పైగా రికార్డవుతున్నాయి. అనకాపల్లి జిల్లాలోనూ పరిస్థితి అలాగే ఉంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు ఎగబాకుతున్నాయి. ఇక విశాఖపట్నం జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు 16, పగటి ఉష్ణోగ్రతలు 38 వరకు నమోదవుతున్నాయి. అంటే వీటి మధ్య వ్యత్యాసం గరిష్టంగా 24 డిగ్రీల వరకు ఉంటోందన్న మాట! ఉదాహరణకు సోమవారం నాటి ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. ఏఎస్సార్ జిల్లాలోని హుకుంపేట 10, జీకేవీధిలో 10.2, చింతపల్లి 10.4, అరకు 10.6, పాడేరు 10.7, జి.మాడుగుల10.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లాలోని మాడుగులలో 14.8, మాకవరపాలెం 15.4, నక్కపల్లిలో 15.6, గొలుగొండలో 15.7, అనకాపల్లి 16.9, నర్సీపట్నంలో 17.9 డిగ్రీలు, విశాఖ జిల్లా పెందుర్తిలో 16.3, భీమిలి 17.9, ఆనందపురం 18, విశాఖ ఎయిర్‌పోర్టులో 19 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఇక గరిష్ట ఉష్ణోగ్రతల విషయానికొస్తే ఏఎస్సార్ జిల్లాలోని పాడేరులో 36, జీకేవీధి 33.2, చింతపల్లి 32.8, హుకుంపేట 32 డిగ్రీలు, అనకాపల్లి జిల్లాలోని మాకవరపాలెంలో 39, అనకాపల్లి 38.4, రోలుగుంట, మునగపాక, సబ్బవరం, పరవాడ, కె.కోటపాడు, గొలుగొండల్లో 38, నక్కపల్లిలో 37 డిగ్రీల చొప్పున రికార్డయ్యాయి. ఫలితంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 2–4 డిగ్రీలు అధికంగాను, కనిష్ట ఉష్ణోగ్రతలు 2–5 డిగ్రీలు తక్కువగాను నమోదవుతున్నాయి. దీంతో వాతావరణం మధ్యాహ్నం సమయంలో మండు వేసవిని, రాత్రి వేళ శీతాకాలాన్ని తలపిస్తోంది. ఇలా మార్చి ఆరంభంలోనే పగలు వివిధ పనులపై బయటకు వెళ్లే వారు వేసవి తాపాన్ని చవి చూస్తున్నారు. ఇళ్లలో ఉంటున్న వారు ఫ్యాన్లు, ఏసీలను తప్పనిసరిగా వినియోగిస్తున్నారు. రాత్రి పూట చలి కాలంలో మాదిరిగానే దుప్పట్లు, రగ్గులను కప్పుకుని నిద్రిస్తున్నారు. అంతేకాదు.. రాత్రి పొద్దు పోయాక రోడ్లపై ప్రయాణించే వారు వణికిపోతూ కనిపిస్తున్నారు. వీరు చలి నుంచి ఉపశమనం పొందడానికి మఫ్లర్లు, స్కార్ఫ్‌లు వంటివి ధరిస్తున్నారు.



సీజన్ మారే వేళ

శీతాకాలం నుంచి వేసవికాలంలోకి సీజను మారే సమయంలో ఇలాంటి వాతావరణ మార్పు చోటు చేసుకుంటుందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. ఇలాంటి సమయంలో గాలిలో తేమ శాతం తగ్గుతుందని, పగటి ఉష్ణోగ్రతలు పెరిగి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి ఒకరు 'సాక్షి'కి చెప్పారు. అందువల్లే పగటి వేళ వేసవి తాపం, రాత్రి సమయంలో శీతల వాతావరణంతో చలి ప్రభావం చూపుతాయని వివరించారు. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, ఆ తర్వాత సాధారణ స్థితికి చేరుకుంటుందని తెలిపారు.



తలనీలాల ఆదాయం రూ. 10.76 కోట్లు

- అప్పన్నకు భక్తులు సమర్పించే తలనీలాల వేలం
- సొంతం చేసుకున్న చెన్నైకి చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్
- గత ఏడాది కంటే రూ.1.49 కోట్లు అధికం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి భక్తులు సమర్పించే తలనీలాల ద్వారా రూ. 10కోట్ల 76లక్షల 89వేల 100 ఆదాయం లభించింది. దేవస్థానం చరిత్రలో తలనీలాల ద్వారా ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం రావడం ఇదే తొలిసారి. వివరాల్లోకి వెళ్తే... ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు స్వామివారికి భక్తులు సమర్పించే తలనీలాలను విక్రయం జరిపేందుకు సోమవారం దేవస్థానం పరిపాలన కార్యాలయంలో బహిరంగ వేలం, సీల్డ్‌టెండర్, ఈ-ప్రొక్యూర్‌మెంట్ నిర్వహించారు. చెన్నైకి చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్, ఏలూరుకి చెందిన ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్, సూర్యోదయ ఎంటర్‌ప్రైజస్, సికింద్రాబాద్‌కి చెందిన నాగకుమారి ఎంటర్‌ప్రైజస్, తిరుపతికి చెందిన గరుడ ఎంటర్‌ప్రైజస్ ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారు. తొలుత బహిరంగ వేలం నిర్వహించగా చెన్నైకి చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్ 9 కోట్ల 52 లక్షలకు హెచ్చుపాట పాడింది. అనంతరం సీల్డ్ టెండర్లు తెరవగా అందులో కూడా అదే సంస్థ రూ.10కోట్ల 76 లక్షల 89వేల100 హెచ్చుమొత్తానికి కోట్ చేసింది. అనంతరం సాయంత్రం దేవస్థానం అధికారులు ఈ ప్రొక్యూర్‌మెంట్‌ని పరిశీలించగా అందులో రూ.10కోట్ల 66లక్షల 5వేల హెచ్చుమొత్తానికి ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ కోట్ చేసింది. మూడు ప్రక్రియల్లో సీల్డ్ టెండరు ద్వారా చెన్నైకి చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్ కోట్ చేసిన హెచ్చుమొత్తాన్ని అధికారులు పరిగణలోకి తీసుకుని ఆమోదం కోసం దేవదాయశాఖ కమిషనర్‌కు పంపించారు. కాగా గత ఏడాది తలనీలాల ద్వారా రూ.9 కోట్ల 27లక్షలు ఆదాయం లభించింది. దీంతో ఈ ఏడాది అదనంగా మరో రూ.కోటి 49లక్షల 89వేల 100 ఆదాయం లభించింది. దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఏఈవో జంగం శ్రీనివాస్, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాస్ వేలం నిర్వహించారు.

సింహగిరిపై కామదహనం పూజలు

సింహాచలం: సింహగిరిపై సోమవారం రాత్రి కామదహనం పూజలను విశేషంగా నిర్వహించారు. రాత్రి ఆరాధన అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను తిరువీధిగా మాడవీధిల్లోకి తీసుకెళ్లి జోడు భద్రాల వద్ద వేంజేపచేశారు. ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు హోమం, పూజలు నిర్వహించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



స్వర్ణభారతి స్టేడియంలో బ్యాలెట్ బాక్సు పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సీతంపేట: ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ చేసేందుకు స్వర్ణభారతి స్టేడియంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌ను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సోమవారం పరిశీలించారు. ఈ నెల 12న ఎన్నికల సామగ్రి పంపిణీ చేయనున్న దృష్ట్యా బ్యాలెట్ పేపర్స్, స్టేషనరీని పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు పాటించాల్సిన జాగ్రత్తలను ఆర్డీవో భాస్కరరెడ్డికి వివరించారు. బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం వి.ఎస్.కృష్ణా కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రం ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో , తహసీల్దార్ శ్యామ్, ఎన్నికల సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తొలుత వచ్చినవారికే ప్రాధాన్యం



మాట్లాడుతున్న డీఆర్‌వో శ్రీనివాస మూర్తి

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచారం నిమిత్తం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మొదటి వచ్చిన వారికి తొలి ప్రాధాన్యతగా అనుమతులను మంజూరు చేస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్‌లో సింగిల్ విండో కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ర్యాలీలు, వాహనాల్లో ప్రచారం తదితర వాటి కోసం సమర్పించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలన చేసి అనుమతులను మంజూరు చేయాలన్నారు. సింగిల్ విండో కమిటీ కలెక్టరేట్ నుంచి విధులను నిర్వహించాలన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



క్వీన్‌మేరీ స్కూల్లో జరిగిన శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్)లో భాగంగా జిల్లాలోని అన్ని స్కూల్ కాంప్లెక్స్‌ల్లో సోమవారం ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. క్వీన్‌మేరీ హైస్కూల్లో గణితం, గాంధీగ్రాం స్కూల్లో తెలుగు సబ్జెక్టులకు సంబంధించి శిక్షణ ఏర్పాటు చేశారు. ఆయా సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులు దీనిలో పాల్గొన్నారు. మంగళవారం కూడా సైన్సు, హిందీ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు కొనసాగనున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ అకడమిక్ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. వృత్తి నైపుణ్యత పెంపుకోసం నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులంతా పాల్గొనాలని కోరారు.

పెన్షనర్లకు ఈకేవైసీ తప్పనిసరి

మహారాణిపేట: ప్రతి పెన్షనర్ ఈనెల 31లోగా ఈకేవైసీ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.డి.ప్రసాదరావు కోరారు. సీతమ్మధార సబ్ ట్రెజరీ కార్యాలయంలోను, జిల్లా పరిషత్ వద్ద ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈకేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు.

నేడు దర్శనవేళల్లో మార్పు

కొమ్మాది (భీమిలి): రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వారి దర్శన వేళలు మంగళవారం మార్పులు చేసినట్టు ఆలయ ఏఈవో రమేష్ తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కోయల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1 గంట నుంచి యథావిధిగా భక్తులకు సర్వదర్శనం ఉంటుందన్నారు.

ఘనంగా హోలికా దహనం



ప్రత్యేక పూజలు చేస్తున్న మార్వాడీలు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): కులమతాలకు అతీతంగా జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో హోలీ ఒకటి. ఈపండుగ ముందు రోజున హోలికా అనే రాక్షసిని దహనం చేస్తారు. తర్వాత రోజు చైత్ర కృష్ణ ప్రతిపాదంలో హోలీ ఆడతారు. ముఖ్యంగా మార్వాడీలు హోలికా దహనం నిర్వహిస్తారు.

హోలికా దహనం ఎందుకు ..

రాక్షస రాజు హిరణ్యకశపుడి కుమారుడు ప్రహ్లాదుడు నిత్యం విష్ణు మూర్తిని స్మరిస్తుంటాడు. అది హిరణ్యకశపుడికి నచ్చదు. దీంతో ప్రహ్లాదుడిని మట్టుబెట్టాలని నిర్ణయించుకుంటాడు. దీంతో అతని రాక్షస సోదరి హోళికను పిలుస్తాడు. ఆమెకు ఉన్న శక్తితో ప్రహ్లాదుడిని మంటల్లో ఆహుతి చేయాలని కోరతాడు. దీంతో ఆమె ప్రహ్లాదుడిని ఒడిలో కూర్చోబెట్టుకుని మంటల్లోకి దూకుతుంది. అయితే, విష్ణు మాయతో ప్రహ్లాదుడు ప్రాణాలతో బయపడగా, హోళిక రాక్షసి మాత్రం ఆ మంటల్లో చనిపోతుంది. హోలిక దహనమైన రోజునే 'హోలీ' అని పిలుస్తారనే ప్రచారం ఉంది. ఆర్కే బీచ్‌లో సోమవారం మార్వాడీలంతా ఘనంగా హోలిక దహనం నిర్వహించారు.

సీతంరాజు గెలుపే ధ్యేయం

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- నగరంలో భారీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు



మాట్లాడుతున్న పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ) : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ గెలుపు కోరుతూ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాలెట్‌లో సీరియల్ నంబరు–3లో సీతంరాజు సుధాకర్ పేరుకు ఎదురుగా 1వ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు. సీతంరాజు గెలుపే ధ్యేయంగా అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు.

జగదాంబ జంక్షన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ వందలాది బైక్‌లు, 3 రథయాత్ర వాహనాలు, 12 కార్లతో సాగింది. జగదాంబ జంక్షన్ నుంచి కేజీహెచ్ అప్‌రోడ్డు, కలెక్టర్ కార్యాలయం, రెల్లివీధి, ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్‌రూమ్, కురుపాం మార్కెట్, పాతపోస్టాఫీస్, లక్ష్మీటాకీస్ జంక్షన్, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, దుర్గాలమ్మ గుడి జంక్షన్, కెప్టెన్ రామారావు జంక్షన్, చావులమదుం, జ్ఞానాపురం, జీఎస్ఎన్ యూఆర్ఎమ్ కాలనీ వరకు.. అక్కడి నుంచి రైల్వే రిజర్వేషన్ కౌంటర్, వివేకానంద విగ్రహం, సంగం శరత్ జంక్షన్, డొండపర్తి, డైమండ్ పార్క్, సుబ్బలక్ష్మి కల్యాణమండపం , శ్రీకన్య థియేటర్ మీదుగా రైల్వే న్యూకాలనీ ఆర్చ్ వరకు సాగింది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువులు, క్రిస్టియన్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, పార్టీ దక్షిణ నియోజకవర్గ పరిశీలకుడు వీసం రామకృష్ణ, రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, ద్రోణంరాజు శ్రీవత్సవ్, కనకమహాలక్ష్మి ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, వార్డు అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఆవిష్కరణకు అద్భుత అవకాశం

- ఆవిష్కర్తలకు, సంస్థలకు వారధిగా నిలుస్తున్న ఎన్ఆర్‌డీసీ
- చెన్నై ఇంక్యుబేషన్ సెంటర్ల పర్యవేక్షణ విశాఖ ఎన్ఆర్‌డీసీకి..
- త్వరలో నేషనల్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ కార్యాలయ స్థాపన దిశగా అడుగులు
- వివిధ దేశాలతో నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఒప్పందాలు



విశాఖలో ఎన్ఆర్‌డీసీ కార్యాలయం ఉన్న కేంద్రం

సాక్షి, విశాఖపట్నం : పరిశ్రమలకు కావల్సిన అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో టెక్నాలజీతో పోటీపడుతున్న యువత మేథో సంపత్తికి మరింత పదును పెడుతోంది విశాఖలోని నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఆర్‌డీసీ). ఆవిష్కర్తలకు, సంస్థలకు వారధిగా నిలుస్తూ.. వస్తువుల పేటెంట్, ట్రేడ్ మార్క్, కాపీరైట్స్ కల్పిస్తూ.. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్న సంస్థకు కేంద్రం మరో పెద్ద బాధ్యత అప్పగించింది. చెన్నైలోని ఇంక్యుబేషన్ సెంటర్ల పర్యవేక్షణ బాధ్యతలను ఇక నుంచి విశాఖలోని ఎన్ఆర్‌డీసీ నిర్వహించనుంది.

ఈ సంస్థ గత నాలుగేళ్లలో అనేక ఆలోచనలకు అద్భుత అవకాశాలు కల్పించింది. ఇప్పటివరకు 550 పేటెంట్లకు, పారిశ్రామిక డిజైన్లు, కాపీరైట్లకు సహకారం అందించింది. అదేవిధంగా 80కి పైగా ఇన్నోవేటివ్ టెక్నాలజీలని వివిధ ప్రముఖ సంస్థలకు బదిలీ చేస్తూ నూతన ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తోంది. మిగిలిన ప్రాంతాల్లో ఉన్న అన్ని ఎన్ఆర్‌డీసీ ప్రాంతీయ కేంద్రాలతో పోలిస్తే చురుగ్గా వ్యవహరిస్తోంది. అందుకే ఈ కార్యాలయానికి కొత్త బాధ్యతలు అప్పగించారు.

రెండు ఇంక్యుబేషన్ సెంటర్ల పర్యవేక్షణ ఇక్కడి నుంచే..

విశాఖలోని ఐటీహిల్–3 కేంద్రంగా ఎన్ఆర్‌డీసీకి చెందిన ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్, టెక్నాలజీ ఇన్నోవేషన్ సపోర్ట్ సెంటర్ పని చేస్తోంది. ఇప్పుడు అదనంగా చెన్నైలో ఉన్న ఎన్ఆర్‌డీసీ ఇంక్యుబేషన్ సెంటర్ల బాధ్యతలు కూడా నిర్వర్తించాల్సి ఉంటుంది. చెన్నైలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ(ఎన్ఐఓటీ)కి అనుబంధంగా ఓషియన్ ఎనర్జీ సాంకేతికతలపై దృష్టిసారిస్తుండగా, సీఎస్ఐఆర్–సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో లెదర్ టెక్నాలజీ సెంటర్‌గా పనిచేస్తున్నాయి. వీటి బాధ్యతల్ని తొలుత ఢిల్లీ లేదా భువనేశ్వర్‌లోని కేంద్రాలకు అప్పగించాలని భావించారు. వాటికంటే మెరుగ్గా విశాఖ కేంద్రం సేవలందిస్తుండటంతో ఈ సెంటర్‌కు రెండు ఇంక్యుబేషన్ సెంటర్ల బాధ్యతలు అప్పగిస్తూ ఢిల్లీలోని కేంద్ర కార్యాలయం నిర్ణయించింది. ఇక నుంచి చెన్నై ఇంక్యుబేషన్ సెంటర్లకు సంబంధించి టెక్నాలజీ బదలాయింపు, వాణిజ్యీకరణ తదితర వ్యవహారాలు విశాఖ నుంచే పర్యవేక్షించనున్నారు.

సాంకేతిక బదిలీకి సరికొత్త ఆలోచనలు

దేశంలో ఆవిష్కృతమవుతున్న సాంకేతికతల్ని వివిధ దేశాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఎన్ఆర్‌డీసీ సరికొత్త అడుగులు వేస్తోంది. ఇక్కడి టెక్నాలజీలకు సరిపడా మార్కెట్ ఉన్న దేశాలను సైతం అన్వేషించింది. ఇందులో భాగంగా సూడాన్, మొరాకో, టాంజానియా దేశాల ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. ఆయా దేశాల్లో టెక్నాలజీ డిమాన్‌స్ట్రేషన్ సెంటర్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అంతేకాకుండా 52 సభ్య దేశాలు కలిగి ఉన్న ఆఫ్రికన్–ఆసియన్ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌తో ఇటీవలే ఎన్ఆర్‌డీసీ ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలోని యువత రూరల్‌డెవలప్‌మెంట్‌కు సంబంధించిన టెక్నాలజీ ఆవిష్కరణలు ఏం చేసినా.. వాటిని ఈ ఆర్గనైజేషన్‌లో ఉన్న ఏ దేశానికైగా ఎగుమతి చేసేందుకు వీలుంటుంది. దీని ద్వారా సాంకేతికతతో కుస్తీ పడుతున్న స్థానిక యువతకు దేశ విదేశాల్లో అవకాశాలు అపారంగా పెరగనున్నాయి. ఐపీ అసిస్టెన్స్, డిజైన్ క్లినిక్, టెక్నాలజీ వాణిజ్యీకరణ మొదలైన అంశాల్లో యువతకు మరింత మెరుగైన సేవలందించేందుకు త్వరలోనే నేషనల్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ కార్యాలయం ఏర్పాటు చేసే దిశగా ఎన్ఆర్‌డీసీ సిద్ధమవుతోంది. ఇది ఒక హబ్‌ని క్రియేట్ చేసి.. దేశానికి సంబంధించిన టెక్ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ సౌకర్యం కల్పించనుంది.

శుభపరిణామం



వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చే బాధ్యతని ఎన్ఆర్‌డీసీ తీసుకుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన సాంకేతికతని అందుబాటులోకి తీసుకొస్తోంది. చెన్నై ఇంక్యుబేషన్ సెంటర్ల బాధ్యతల్ని కూడా విశాఖ ఎన్ఆర్‌డీసీకి అప్పగించడం శుభపరిణామం . జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్‌తో కూడా ఎంవోయూ కుదుర్చుకునే దిశగా అడుగులు వేస్తున్నాం.

– అమిత్ రస్తోగి, ఎన్ఆర్‌డీసీ సీఎండీ

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జిల నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనుబంధ విభాగాల జోనల్ (అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాల) ఇన్‌ఛార్జిలను నియమించారు. పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

యువజన విభాగం–ఎం.సునీల్‌కుమార్(విశాఖ నార్త్)
రైతువిభాగం– చిక్కాల రామారావు(పాయకరావుపేట)
బీసీసెల్–తుల్లి చంద్రశేఖర్ (విశాఖ నార్త్)
వైఎస్సార్‌టీయూసీ– కలిదిండి బద్రినాథ్ (విశాఖ వెస్ట్)
పంచాయతీరాజ్ వింగ్– బోడెపు గోవింద్ (యలమంచిలి)
ఎస్టీ సెల్– కిముడు శ్రీనివాస విశ్వ ప్రసాద్ నాయుడు(పాడేరు)
మైనారిటీ సెల్– బర్కత్ ఆలీ(విశాఖ నార్త్)
విద్యార్థి విభాగం– బి.కాంతారావు (విశాఖ ఈస్ట్)
వికలాంగుల విభాగం– ఇమంది వెంకటరమణ(అనకాపల్లి)
వైఎస్సార్‌సేవాదళ్– సేనాపతి రామ్మూర్తి(నర్సీపట్నం)
డాక్టర్ వింగ్– నరసింగరావు(పాడేరు)
వాణిజ్యవిభాగం– నారాయణశెట్టి శ్రీరామ్మూర్తి(విశాఖ ఈస్ట్)
సాంస్కృతిక విభాగం– వంకాయల మారుతీ ప్రసాద్(భీమిలి)
పబ్లిసిటీ వింగ్– కంపా హనోక్(విశాఖ నార్త్)
మహిళా విభాగం– గరికిన గౌరి(విశాఖ సౌత్)
గ్రీవెన్స్ సెల్ విభాగం– చొక్కాకుల వెంకట్రావ్(పెందుర్తి)
వీవర్స్ వింగ్– సూరిశెట్టి సూరిబాబు(పెందుర్తి)

జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా వై.ప్రేమ్‌బాబు, వికలాంగ విభాగం అధ్యక్షుడిగా కోరాడ అప్పలస్వామినాయుడును నియమించారు.

అక్రమ కట్టడాలు, ఓపెన్ డ్రైన్‌లపై ఫిర్యాదులు

జీవీఎంసీ స్పందనలో వినతుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ) : ఓపెన్ డ్రైన్‌ల మరమ్మతులు చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న కట్టడాలను అరికట్టాలని జీవీఎంసీ స్పందనలో పలువురు ఫిర్యాదులు చేశారు. జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ స్పందన కార్యక్రమం నిర్వహించారు. వీటిలో ప్రధానంగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జోన్-4 పరిధి సిరిపురంలో అనధికార కట్టడాలు ఎక్కువయ్యాయని రావాడ అప్పలనాయుడు, వేంకటేశ్వరమెట్ట ప్రాంతంలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని కమల్‌కిషోర్, జోన్-5 పరిధి అక్కయ్యపాలెం జగన్నాథపురంలో అక్రమ నిర్మాణాలపై గూడూరు పెంటారావు ఫిర్యాదు చేశారు. జోన్-4 పరిధి భానోజీనగర్‌లో ఓపెన్ డ్రైన్‌లు మరమ్మతులు చేపట్టాలని ఎస్.పియూష్ ఫిర్యాదు చేశారు. జోన్-3 పరిధి రాజేంద్రనగర్ నుంచి తిప్పాన రాంబాబు ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించి ఫిర్యాదు చేశారు.

జోన్-1 నుంచి ఒకటి, జోన్-2 నుంచి మూడు, జోన్-3 నుంచి 16, జోన్-4 నుంచి ఎనిమిది, జోన్-5 నుంచి పది, జోన్-6 నుంచి పది, జోన్-8 నుంచి ఆరు, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి ఒక ఫిర్యాదు వచ్చింది. మొత్తంగా అందిన 55 ఫిర్యాదుల్లో పరిపాలన అండ్ అకౌంట్స్ విభాగానికి 1, రెవెన్యూకి 6, ప్రజారోగ్యానికి 4, పట్టణ ప్రణాళికా విభాగానికి 26, ఇంజినీరింగ్ అండ్ హార్టీకల్చర్‌కు 14, యూసీడీకి 4 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని పరిశీలించి 3 రోజుల్లో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళికా అధికారి బి.సురేష్‌కుమార్, సెక్రటరీ పి.నల్లనయ్య, హార్టీకల్చర్ డీడీ దామోదరరావు, డీసీ (రెవెన్యూ) ఫణిరాం, రీజనల్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్ కృపానందం, డీపీవో చంద్రిక, డీసీపీలు, ఏసీపీలు, డీఈవో శ్రీనివాసరావు, యూసీడీ పీవో సూర్యకళ, పర్యవేక్షక ఇంజినీర్లు, యూసీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరానికి జ్వరం

- కేజీహెచ్‌కు రోగుల తాకిడి
- వైరల్ జ్వరాల వ్యాప్తి
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

మహారాణిపేట (విశాఖ దక్షిణ): తగ్గని జ్వరం.. అదే పనిగా దగ్గు.. తోడుగా శ్వాసకోశ సమస్యలు..కోలుకునేందుకు సాధారణం కంటే అధిక సమయం పడుతోంది..దీంతో నగరంలో వీటి బారిన పడి బాధితుల సంఖ్య పెరుగుతోంది. అధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. కేజీహెచ్‌కు బాధితులు క్యూ కడుతున్నారు. సీజనల్ వ్యాధులతోపాటు వైరల్ జ్వరాల వ్యాప్తి పెరుగుతోంది. దీంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు.

నగరంలో ఎక్కడ చూసిన జ్వరం, చలి, ఒళ్లు నొప్పులు, తలనొప్పి లక్షణాలతో బాధపడుతున్న వారే కనిపిస్తున్నారు. వాతావరణంలో మార్పుల వల్ల వైరల్ ఫీవర్లు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో కేజీహెచ్‌తో పాటు పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులు చికిత్స పొందుతున్నారు. నగర పరిసర ప్రాంతాల్లో దోమల బెడద అధికంగా ఉంది. అపరిశుభ్ర వాతావరణం, ఎక్కడికక్కడే నిలిచిపోయే మురుగుతో దోమల ఉధృతి పెరిగింది. గాజువాక, మల్కాపురం, సింధియా, వేపగుంట, పెందుర్తి, కొమ్మాది, పూర్ణామార్కెట్, టౌన్‌హాలు రోడ్డు, వెలంపేట, టౌన్ కొత్తరోడ్డు తదితర ప్రాంతాల్లో దోమల బెడద అధికంగా ఉంది. దోమలు స్వైర విహారం చేయడంతో వైరల్ ఫీవర్ల జోరు పెరిగింది. శీతాకాలం నుంచి ఎండా కాలంలోకి అడుగు పెట్టడంతో సాధారణంగా జ్వరాలు సోకుతాయని వైద్యులు చెబుతున్నారు. నగరంలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు కూడా వణికిస్తున్నాయి.

రోజుకు 30–40 కేసులు

కేజీహెచ్ ఓపీ విభాగానికి రోజుకు 30 నుంచి 40 కేసులు వస్తున్నాయి. వీరిలో కొంత మంది ఆస్పత్రిలో చేరగా, కొంత మంది అవుట్ పేషెంట్ కింద చికిత్స తీసుకొంటున్నారు. ఆస్పత్రిలో చేరిన వారికి మెరుగైన వైద్యం అందజేస్తున్నారు. ప్రస్తుతం డెంగ్యూ కేసులు 6, మలేరియా కేసు 1 నమోదైంది. వీరికి కేజీహెచ్‌లో ప్రత్యేక వైద్యం అందజేస్తున్నారు.



కేజీహెచ్ ఓపీలో జ్వర బాధితులు

జ్వరపీడితులు పెరుగుతున్నారు



కేజీహెచ్‌కు డెంగ్యూ, మలేరియా కేసులు వస్తున్నాయి. రోజు రోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతోంది. గత కొద్ది రోజులుగా వైరల్ ఫీవర్లతో జనం బాధపడుతున్నారు. అన్ని రకాల జ్వరాలకు కేజీహెచ్‌లో వైద్య సేవలు అందుతున్నాయి. డెంగ్యూ కేసులు సోకడం వల్ల రోగికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. వైద్యులు అప్రమత్తంగా వైద్య సేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ పి.అశోక్‌కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్

పోలీస్ స్పందనకు 29 ఫిర్యాదులు



సమస్యలు తెలుసుకుంటున్న సీపీ శ్రీకాంత్

అల్లిపురం (విశాఖ దక్షిణ): పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన స్పందనకు 29 ఫిర్యాదులు అందినట్టు నగర పోలీసు కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ వెల్లడించారు. పోలీస్ కమిషనర్ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సమస్యలు పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, సివిల్ కేసులు, మోసానికి సంబంధించినవి ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. స్పందన కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు పాల్గొన్నారు.

అర్జీలు రీఓపెన్ కాకూడదు



వినతులు స్వీకరిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పిటీషన్లు వెంటనే పరిష్కరించాలన్నారు. స్పందనలో వచ్చిన ఏ ఒక్క అర్జీ రీఓపెన్ కాకుండా ఆయా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలు వచ్చిన 24 గంటలలోపు వెబ్‌సైట్‌లో పొందుపరిచి పరిష్కారం మార్గం కూడా చూపాలన్నారు. సోమవారం స్పందనలో 162 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి మాధవి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డీఎస్‌వో సూర్య ప్రకాశరావు, జీవీఎంసీ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ కూటికుప్పలకు ఐఎంఎస్-2023 అవార్డు

కంచరపాలెం : వారణాసిలో ఇంటర్నేషనల్ అమికబిలిటి డిప్లమాటిక్ క్లబ్ నేతృత్వంలో మార్చి 3 నుంచి 6 వరకు జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో వైద్యుడు పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు 2023 సంవత్సరానికి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వైద్య శాస్త్రవేత్త అవార్డును సోమవారం అందుకున్నారు. భారత ప్రధాని అంబాసిడర్ ప్రత్యేక కార్యదర్శి దీపక్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు ఆయన తెలిపారు. వోహ్రా ఐఎఫ్ఎస్, యూకేకు చెందిన హిస్ హోలినెస్ మోహన్‌జీ, రష్యా శాస్త్రవేత్త డాక్టర్ సెర్గీ పలువురు రాయబారులు, శాస్త్రవేత్తలు డాక్టర్ కూటికుప్పలను అభినందించారు.

ప్రతిభకు 'వేదిక'

రెండో రోజు ఉత్సాహంగా ప్రదర్శనలు



ప్రదర్శనలతో అలరిస్తున్న కళాకారులు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): సాంస్కృతిక, సంప్రదాయాలతో పాటు నగర వాసుల ప్రతిభను ప్రదర్శించేందుకు వేదిక ఓ చక్కటి అవకాశమని జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు అన్నారు. వేదిక పేరుతో నిర్వహిస్తున్న వైజాగ్ టాలెంట్ హంట్ కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోందని సన్యాసిరావు తెలిపారు. ఇప్పటి వరకు 400 రిజిస్ట్రేషన్లు జరిగాయని, రోజుకు 30 నుంచి 50 ప్రదర్శనలు జరుగుతున్నాయ న్నారు. క్లాసికల్, వెస్టర్న్, కర్రసాము, గిటారు మ్యూజిక్ వంటి ప్రదర్శనలు అద్భుతంగా సాగాయి.



కానిస్టేబుళ్లపై దాడి చేసిన నిందితుడికి రిమాండ్



నిందితుడు గొమాంగి గోపీనాథ్

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): ఇద్దరు కానిస్టేబుళ్లపై దాడికి పాల్పడిన వ్యక్తిని ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల కాకానినగర్ సాయి ప్రియా అపార్ట్‌మెంట్‌లో ఓ మహిళ 100 డయల్ చేయగా ఘటనా స్థలానికి వెళ్లిన ఎల్.కృష్ణారావు, కేవీవీ కిశోర్‌పై అల్లూరి సీతారామరాజు జిల్లా వెంగడ గ్రామానికి చెందిన గొమాంగి గోపీనాథ్ సుత్తితో దాడికి పాల్పడ్డాడు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ ఈ నెల 17 వరకు రిమాండ్‌కు విధించారు.

మహిళా దినోత్సవ క్రీడా పోటీలు



విశాఖ స్పోర్ట్స్: క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఈనెల 8 నుంచి 25వ తేదీ వరకు పలు వేదికల్లో ఈ పోటీలు అన్ని వయస్సుల వారికి నిర్వహించనున్నారు. 8న ర్యాలీ నిర్వహించనుండగా 9న అథ్లెటిక్స్, 10న బాస్కెట్‌బాల్, 11న కబడ్డీ పోటీలతో పాటు యోగా, సంప్రదాయక పోటీలు జరగనున్నాయి. ఆయా పోటీల్లో పాల్గొనేవారు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోని డీఎస్ఏ కోచ్‌లను సంప్రదించవచ్చని వీడీసీఏ చీఫ్ కోచ్ సూర్యారావు తెలిపారు.

సైబర్ టెక్ సెల్ ఏర్పాటులో ముందడుగు



సమావేశంలో పాల్గొన్న పోలీస్, ఐటీ ప్రతినిధులు

అల్లిపురం: సైబర్ సెక్యూరిటీ సెల్ ఏర్పాటులో నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ముందడుగు వేశారు. ఈ మేరకు కమిషనర్ ఆదేశాల మేరకు సీఆర్ సీఐడీఎఫ్, న్యూఢిల్లీకి చెందిన పాటిబండ్ల ప్రసాద్ సమన్వయకర్తగా టెక్ మహీంద్రాలో విశాఖ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ గవర్నింగ్ బాడీతో సోమవారం నాలుగోసారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో ఉంచుకుని సైబర్‌సేఫ్టీ, సెక్యూరిటీ, వుమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ, రోడ్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ కారిడార్ పరిరక్షణ, క్రైమ్ మానిటరింగ్ వంటి రక్షణ చర్యలు మరింత పగడ్బందీగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవడంపై చర్చించారు. సొసైటీ ఫర్ విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (వీసీఎస్‌సీ) ఏర్పాటు దిశగా నగర పోలీస్ కమిషనర్ ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ సైబర్ సెల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. దీంట్లో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన, మహిళల భద్రత, ఇతర స్థానిక నేరాల నియంత్రణ మీద ముందస్తు జాగ్రత్తలు, త్వరితగతిన విచారణ జరపడం కోసం సైబర్ టెక్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ప్రముఖ ఐటీ కంపెనీ ప్రతినిధులు, ఫార్మా కంపెనీ ప్రతినిధులు, పోర్టు హాస్పిటాలిటీ అండ్ హోటల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నేత మంత్రి మూర్తి మృతి



మంత్రి మూర్తి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ (గాజువాక): విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు మంత్రి మూర్తి (53) సోమవారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కార్మిక సంఘం అధ్యక్షుడిగా 20ఏళ్ల పాటు సేవలందించారు. మూర్తి మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, స్టీల్‌ప్లాంట్ సీజీఎం హెచ్ఆర్ కల్లూరి శ్రీనివాసరావు, సీజీఎం కె.సంజీవరావు, క్యూఏటీడీ విభాగాధిపతి శ్రీనివాస్, బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి ఆది నారాయణ, పలు కార్పొరేటర్లు, రాజకీయ నాయకులు, అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు, శిష్ట కరణాల అసోసియేషన్ నాయకులు ఎస్ఎస్‌కే మహంతి, బెనర్జీ దర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సిటీలో దాస్ కా ధమ్కీ యూనిట్

అల్లిపురం: ఉగాది కానుకగా ఈ నెల 22న దాస్ కా ధమ్కీ చిత్రం విడుదల చేస్తున్నట్లు చిత్ర దర్శకుడు, వర్ధమాన నటుడు విశ్వక్ సేన్ తెలిపారు. చిత్రం ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ సోమవారం సాయంత్రం జగదాంబ థియేటర్‌లో సందడి చేసింది. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ తన స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల వారిని అలరిస్తుందన్నారు. విభిన్న అంశాలతో అద్భుతమైన కథ కావడంతో తానే దర్శకత్వం బాధ్యతలు చేపట్టానన్నారు. సినీ రంగంలో దాస్ కా ధమ్కీ సరికొత్త రికార్డులను సృష్టిస్తుందని విశ్వక్ సేన్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతాన్ని లియోన్ జేమ్స్ చేకూర్చారన్నారు. ఇప్పటికే విడుదల చేసిన రెండు పాటలు యూట్యూబ్‌ని షేక్ చేస్తున్నాయన్నారు. ప్రేక్షకులు తమ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. కథానాయికగా నివేదా పేతురాజ్, రావు రమేష్, రోహిణి, హైపర్ ఆది, అజయ్, తరుణ్ భాస్కర్, అప్పరగౌడ్ కీలక పాత్రలు పోషించారని వివరించారు.

కలర్‌ఫుల్ పండగకు రెడీ



వసంత కాలంలో వచ్చే రంగుల హోళీ.. జీవితంలో నింపేనే సంతోష కేళీ.. అంటూ రంగుల పండగ సంబరాలకు నగరం సిద్ధమవుతోంది. హోలీ రంగులు జల్లుకునేందుకు సరికొత్త వస్తువులు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. పిల్లలను ఆకర్షించేలా బ్యాక్‌ప్యాక్ గన్స్, ఏకే 47, మిసైల్స్ రూపంలో కలర్‌ఫుల్ రంగుల కోసం గతంలో ఎన్నడూ లేని విభిన్నమైన ప్రొడక్ట్స్ అందుబాటులోకి వచ్చాయని అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డులోని న్యూషాప్ యజమాని వెంకటేష్ చెబుతున్నారు.

– ఫొటోగ్రాఫర్ : ఎమ్‌డీ నవాజ్